కథా నిలయం
శ్రీకాకుళం

# బాధపడినగుండె

ఆనందరావు ఓ షావుకారుగారివద్ద గుమాస్తాగిరి వెలిగిస్తున్నాడు. షావుకారుగారివద్ద పనిచేయటమంటే మాటలు గాదు. అనేకరకాల అనుభవాలు కలుగుతాయి. ఆ అభనువాలను జీర్ణించుకోవటంలోనే ఉంది అసలు తమాషా అంతాను.

అయితే ఆనందరావు కాబట్టి యీ గుమస్తాగిరి నిర్వహించ గలుగుతున్నాడనడము తప్పే; కాని యిట్లాఆనందరావు లాంటివాళ్ళు ప్రతి షావుకారు దగ్గర ఒక్కొక్క డున్నాడనటం చాల సమంజసం.

అసలంత కష్టమైన పను లతను చేసేవి యేమిటీ అంటే నిజానికవి యేవీ లేవనేఅనాలి. అయితే 'యేదైన కోటాసరుకు ఉందా ?' అని అడగ్గానే చటుక్కున తడువుకోకుండానే ఆసరుకు తమవద్ద లేనే లేదనేసెయ్య గలగాలి. ఇక, పనికిరాని వస్తువు మనముందు పడేసి 'ఇదెంతో అద్భుతమైనది. మరింకెక్కడా దొరకనిది' అని యేకరవుపెట్ట గలగాలి. నిజాని కివి యేమంత కష్టమైనవికావు. ఇక మనమివే కష్టమైన పనులనుకుంటే, అతను

వీటిని మించిపోయిన పనులెన్నో అతి చులాగ్గా, బహు తెలివిగ నిర్వహించ గలుగు తున్నాడు. ఏ ఆఫీసరుగారైన వాళ్ళ కొట్టుకువచ్చి లెక్కల పుస్తకాలు తనిఖీ చెయ్యడాని కివ్వమని అడగడమే తడవుగ ఆనందరావు యే పుస్తకాలివ్వాలో అవే - తడువుకోకుండా నిమిషాల మీద యిచ్చెయ్యగలడు. అడిగిన దానికి వణుకులేకుండా జవాబు చెప్పగలడు. ఇట్లా పరీక్ష చెయ్యడానికి వచ్చినవారికి కాఫీ చప్పున తెప్పించి యివ్వడంలో అతని కతనేసాటి. అతనికి బాగా తెలుసు - కాఫీలో మత్తు పదార్థం ఉందని. ఆఫీస రిక యక్షప్రశ్నల లోనికి దిగాడంటే అతన్ని మాటల్లోపెట్టి తను ఆ ఆఫీసరుగా రింటికి నా డేమేమి పంపించి ఉన్నాడో ఓ చదువు చదివి, యిక ఆఫీసరుగార్ని ఓ క్షణముకూడ అక్కడ కూర్చోకుండా చెయ్యడంలో అత నంత ఘటికుడు మరొకడు లేడని ఆ ప్రాంతంలో ప్రసిద్ధి.

ఇట్లాంటి చరిత్ర ప్రసిద్ధమైన పనులను కొనసాగించటమే కాకుండా కొన్ని అతిస్వల్ప కార్యాలు అతనికి రోజూ తటస్థ పడుతూ ఉంటాయి. వాటిని సాధించే విషయం అతని కభ్యాసమే కాబట్టి, ఆ సాధింపులోవచ్చే బాధ లాతనికంటవు. అభ్యాసం కూసు విద్య అన్నారు అందుకనే. మనం చిన్నప్పటి నుంచి అబద్ధాలాడటమో చెయ్యరాని పనులు చెయ్యటమో అభ్యసిస్తే, అందుకు భిన్నంగా నడచేవాళ్ళను చూసి అసహ్యించు కుంటాము. అంచాత ఆనందరావుకు నిజమాడే వాడ్నిచూస్తే డోకు. అయితే అబద్ధాలాడే వాళ్ళు తనకు

పోటీవస్తే అతనికెంతో అసహ్యం. ఇదంతా మొదట్లో అతనికి తెలిసేదికాదు. కాని వాళ్ళ షావుకారు మహాశయుడు తిట్లతో అతన్ని బుజ్జగించి, బుద్ధిగఱపి అతనుఏయే పనుల్లో ఏయేవిధంగా నడచుకోవాలో చక్కని తరిఫీదు మిలిటరీ ట్రైనింగులాంటిది యివ్వగలిగాడు. దీని కతను నిజంగా వాళ్ళ షావుకారు యెడల ఎంతో కృతజ్ఞత చూపించవలసిఉంది. ఈబాకీ అతను తీర్చక పోవడమే కాకుండా ఆ షావుకారుదగ్గఱ పుచ్చుకున్న బాకీలు ఎగగొట్టటానికి ప్రయత్నిస్తాడు. అసలు ఎప్పటికైనా ఇతనూ ఓ షాహుకారు కావొచ్చు ఆ యజమాని యిచ్చిన తరిఫీదు మహత్యంవల్ల. కాని ఇతనికా కృతజ్ఞతఉంటేగా! ఆభావం ఈషణ్మాత్రం లేకుండా పోవడమేకాకుండా ఇంకో కొట్టుగుమస్తా ఎదురైనప్పుడల్లా భగవత్ స్వరూపుడు, గురుతుల్యుడు, అన్నదాత, అయిన షావుకారుమహాశయుణ్ణి అనరానిమాటలనటం క్షమించ తగ్గ విషయంకాదు. అయితే ఈమాటలతనికి మామూలేకాబట్టి మనమంత పట్టించుకోనవసరంలేదు. నిజంగా ఆ మాటలపంథాకు అలవాటుపడిపోవడంవల్ల అందులోంచి తప్పించుకొని మాట్లా డట మనేది చావుతో సమానమైనపని. పాపం ఒకసారి అతని యిల్లాలు, స్వయంగా అర్ధాంగి, 'పంచదారపట్టుకరండీ' అంటే 'మూడురూపాయలిలాఇయ్యి' అన్నా డీఆనందరావు. ఈవిషయం అతనికి చాలసార్లు జ్ఞాపకానికివచ్చింది. ఇది తనయొక్క న్యాయ బుద్ధికి నిదర్శనమని అతనెప్పుడూ తలపోస్తూ ఉంటాడు!

ఆ రోజున వాళ్ళకొట్టుకు హార్లిక్సు కోటా వచ్చింది. వచ్చినవి రెండే రెండు డజన్ల సీసాలు. వాటికి ఎగబడేజనం

రెండువందలవరకూ ఉంటారు. కాబట్టి వాటిని భద్రంగా కాపాడవలసిన బాధ్యత షావుకారుగారిమీద ఎంతైనాఉంది. అవి అంత తక్కువగా వస్తూండటానికి పాపం అతనెట్లా బాధ్యుడవుతాడు. కాని వాటినంత ఎక్కువధరకి అమ్మేబాధ్యత తప్పకుండా అతనిమీద ఉందనే అనాలి. లేకపోతే అనవసరమైన వాళ్ళు, అక్కర్లేనివాళ్ళు వచ్చి వాటిని కాజేసుకపోయి ఇతరత్రా అనేకవిధాలైన లాభాలు గుంజటానికి ఉపయోగించటమనే తప్పుపనులు చేస్తారు. అందువల్ల ఆ సరుకు లేదండీ అని ప్రచారం చేస్తే ఆ సరుకు నిజంగా కావలసినవాళ్ళు ఎంతో బ్రతిమాలి, డబ్బెక్కువైనా యిచ్చి కొనుక్కొని అవసరానికి దొరికిందికదా అని వెధవడబ్బు పోతేపోయిందని ప్రాణం లభించినట్టుగా సంతోషిస్తారు. ఇంత ఆనందాన్ననుభవించేవాళ్ళకే వాటినమ్మటం ఎట్లా న్యాయబద్ధంకాదో ఎవరు చెప్పగలరు? ఆ సరుకుకోసం ఎంతో తపించి పోయేవాళ్ళు తెలియాలంటే ఇంతకన్నా సక్రమమైన మార్గం ఇంకేముంది? అంచేతనే చాలమంది ఆఫీసర్లు 'సత్యంగారూ! మీరనుసరిస్తూన్న మార్గం రాజమార్గమండీ' అని ఓ పెద్ద సర్టిఫికేట్ యిచ్చారు. అది పటంకట్టించుకోవటానికి కాగితంమీదలేదు కాబట్టి వీలుకలిగింది కాదుకాని, లేకపోతేమాత్రం కాదనేవాళ్లెవ్వరు? ఇక యీ ఋజుమార్గాన్ని ఈ షావుకారు సర్వకాల సర్వావస్థలయందు అంటిపెట్టుకొని ఉంటానని పూచీపడుతున్నాడు. రాజకీయ నాయకుల్లా మాటమాటికి ఈ పార్టీలోంచి ఆ పార్టీలోనికి ఆ పార్టీలోనుంచి ఈ పార్టీలోనికి మారేపంథా తన దెప్పుడూ

కాదని ఘంటా భజాయించి చెప్పుతున్నాడు. ఇంతకీ ఈ మార్గంవదిలేస్తే తనకు పుట్టగతుల్లేవని అతనికిబాగా తెలుసు.

అయితే ఈసరుకును జాగ్రత్త చేయమని ఆనందరావుకు చెప్పి ఎవరొచ్చినా ఇంకా—సరుకు రాలేదని చెప్పమని షావుకారు చాలా ధాటీగా హుకుం జారిచేశాడు. ఆనందరావు తన అధినేత చెప్పినపని తు. చ. తప్పకుండా అణాపైసలతో సహా ఆచరించటంలో పరమ చాదస్తంకల మనిషి. అంతే కాకుండా షావుకారు ఇట్లాచెప్పేముందు కొన్ని తిట్లు వడ్డించి పోవడంవల్ల, అతను యింకాగట్టిగా ఈ విధిని నిర్వర్తిస్తాడనటా-సికి అణుమాత్రం సందేహంలేదు.

తన కొట్టులోనికి యే ప్రజావసరవస్తువు వస్తున్నప్పటికీ హారతి కర్పూరం గుప్పు మన్నట్లు ప్రజానీకానికి చప్పున తెలిసి పోతుండటం 'యిక యేమాత్రం సహించలే' నని షావుకారు ఆనందరావును మందలించటం, ఆనందరావు 'అట్లా నే నెప్పుడూ యెవ్వరికీ చెప్పలే' దని పిల్లిలా మాట్లాడటం, షావుకారు కళ్ళెఱ్ఱజేయడం, ఆనందరావు ఏమో...యెక్కడైనా పొరపాటున నోరు జారిపోయిందేమో నని అనుమానంలో పడిపోయి నోరు తేలవేయడం, షావుకారు 'జాగ్రత్త' అని గర్జించి, శాంతించడం, ఆనందరావు బ్రతికి బయటపడటం-జరగటంవల్ల ఆతనిక జాగ్రత్తగానే ఉంటాడనే విషయంలో యిక సందేహం యేమాత్రం లేదు.

షావుకారుగారు అనేక రకాలైన పనులు గుమస్తా ఆనందరావుకు పురమాయించి, భోజనానికి ఇంటికి వేంచేసాడు. ఆనందరావు కొట్టుమీద కూనిరాగాలు ఆలాపిస్తూ, చెట్టుక్రింద జట్టువాళ్ళు భోజనం చేస్తూఉంటే అటుచూస్తున్నాడు. జనం పల్చపల్చగా వస్తూ పోతున్నారు. ఏమంత పెద్ద విశేషాలులేవు. ఏమంత పెద్ద బేరాలూ లేవు.

ఇంతలో ఓ మోరిస్ మైనరు కారు కొట్టుముందు చటుక్కున వచ్చి ఆగింది. ఆనందరావు నిదానించి చూసాడు. అందులోంచి మాంచి హుషారుగా మిస్. కామేశ్వరిM.B.B.S దిగింది–దిగడమే తడవుగా కొట్లో అడుగు పెట్టింది–అడుగు పెట్టడమే తడవుగా 'షావుకారుగారు లేరా?' అంది–అడగటమే తడవుగా ఆనందరావు చిరునవ్వు చిందుతూ 'భోజనానికి వెళ్ళారండీ' అన్నాడు.

ఆమె 'ఎప్పుడు వస్తారు?' అంది చేతి గడియారం చూచుకుంటూ.

ఆనందరావు చాల చురుగ్గా 'భోజనం చేసిన వెంటనే వచ్చేస్తారండి.' అన్నాడు–ఆయన వచ్చేస్తున్నట్టుగానే.

'అంటే టైం తెలియదాలండి!' అంది చాల అమాయకంగా ఆ డాక్టరమ్మగారు.

'అంతే టైం ప్రకారం భోంచెయ్యరండి ఆయ నెప్పుడూ' అన్నాడు పళ్ళన్నీ ఇవతల పెట్టి నవ్వు ముఖంతో.

'పోనీలెండి. ఆయన యెప్పుడు వస్తే నాకేం కాని, నాకో హార్లిక్సు బాటిలు యివ్వండి-త్వరగా పోవాలి' అంది హార్లిక్సు పుచ్చుకుందామని పాపం.

వెంటనే ఆనందరావు 'ఈ మాత్రం దానికి మాషావు కారుగారే ఉండాలటండీ? నేనివ్వనూ? కాని వాటమ్మ కడుపు కాల! ఎక్కడలేని వాళ్ళకు అవే కావాలండి. మీ లాంటి ముఖ్యంగా కావలసినవాళ్ళు చూడండి యెంతో చిక్కు పడుతూ వుంటారు. అసలీ ప్రభుత్వమే అంతండీ. అంతా చిక్కుల ప్రభుత్వం. ఏదీ కావలసినవాళ్ళకు చిక్కనివ్వదుకదా! అంచాతే మేమీసారి ఈ ప్రభుత్వానికి వోటు యివ్వదలచుకో లేదండి' అని ఓ పడున్యాసం దంచాడు.

'అయితే యింతకీ వున్నట్టా? లేనట్టా!' అని ఆమె యింకా వున్నాయేమో అని ఆశపడుతూ అడిగింది.

'అబ్బే! అవి వుంటే యింకేమండి?' అన్నాడు ముక్కూ కళ్ళూ పెద్దవిచేసి.

'అయితే మళ్ళీ మీ కొట్టు కెప్పుడువస్తాయో కాస్త చెబుతారా!' అందావిడ.

'వస్తాయండి-కొద్దిరోజుల్లోనే వచ్చేస్తాయండి. మాయ ముండా రైళ్లు చూడండి తిన్నగా రావటంలేదు. పైపెచ్చు యేదో సమ్మెచేస్తారట ఆ రైల్వే పనివాళ్ళు. వాళ్ళపార్టీకికూడ మేము వోటివ్వం లెండి' అని అంటే—

'ఏమిటో మీరు చెప్పింది నాకు బోధపడటంలేదు. సూటిగా చెప్పరేం? అసలు ఫలానారోజున వస్తాయని మీ కేమైనా తెలుసా?' అంది.

'అదేనండి కంపెనీవాళ్ళు మాకు తెలియబరచిన వెంటనే వచ్చేస్తాయండి. ఈ త్రోవలో రైళ్ళెక్కడా తిరగబడకుండా వుంటే త్వరగానే వచ్చేస్తాయండి. మధ్య యీ కమ్యూనిస్టులబాధ ఒకటుంది చూడండి' అని అతని ధోరణిలోనికి అతను పోతూఉంటే—

'పోనీలెండి. ఎప్పుడో ఒకప్పుడు వస్తాయి. కాస్త అప్పుడైనా మాకిస్తారా?' అంది.

'అయ్యో! అలాగంటారేమిటండీ?... మీ కెన్నిసార్లివ్వలేదూ? యిప్పుడు మాత్రం వుంటే యివ్వమటండీ? యిందులో ఊరికే యిస్తున్నామా? దానం చేస్తున్నామా? డబ్బుచ్చుకుని యివ్వడానికేమండి? అందులో మీకు' అని ఆనందరావు వాగేస్తూ వుంటే—

'ఇదేమిటండోయ్? మీరు నాకెప్పుడిచ్చారు?... ఇది మరీబాగుంది' అని కామేశ్వరి ఆనేసరికి—

'ఓహో! మీకు గాదు. డాక్టరు రమణమ్మగారికి యిచ్చాను. మీ కనుకున్నాను పొరపాటున. చూడండి—యెంతోమంది వస్తూపోతూ ఉంటారు. ఎన్నని జ్ఞాపకం ఉంటాయండి' అని అంటే—

'రవణమ్మగా రెవరండి ఈ వూళ్ళో ? రవణమ్మగారనే డాక్టరమ్మగా రెవరూ లేరే...'

'లేకపోవడ మేమిటండి...ఒహో అన్నట్లు మరచి పోయాను. ఆమె పేరు బహు చిత్రమైన పేరు. నాలుకమీద ఆడుతూందండి...ఆమె పేరు......'

'పోనీలెండి...అయితే యిక నిజంగా అది లేనట్టేగా' అంది యింకోసారి అతని వాలకాన్ని అనుమానించి కాబోలు— పాపం !

'అబ్బే! మీరిన్ని సార్లడగాలటండీ... ఈ సారి రాగానే మీ యింటికి తీసుకొచ్చి యిస్తాను'

'మీరు మా యింటికి తీసుకు రానక్కర్లేదులెండి. అసలు వచ్చినప్పుడు కాస్త కబురు పంపితే చాలు'.

'అలాగేనండి... మాకు యిచ్చేవాళ్ళు జోలెడంత బకాయి పడిపోయారండి. కాని వెధవది పంపరు. ఏమి చెయ్యమండి ? ఇలా కావలసిన బేరాలన్నీ పోతున్నాయండి. మీరు రాక రాక వచ్చారు. చివరికి ఉత్త చేతులతో పంపుతున్నాను' అని అంటూండగానే షావుకారు వచ్చాడు. షావుకారు వచ్చీ రాగానే 'ఏమండమ్మగారు ఇలా వచ్చారు?' అన్నాడు. ఆమె 'అబ్బే ఏమీ లేదండి. ఓ హార్లిక్సు బాటిలు ఉంటే తీసుకెళ్దా

మని వచ్చానండి' అనగానే షావుకారు కాస్తకూడ జాప్యం చెయ్యకుండా 'హార్లిక్సాండీ......ఏయ్ ఆనందరావ్. వీరికో హార్లిక్సు బుడ్డియ్యి త్వరగా' అన్నాడు. ఇక ఏం చెప్పను ఆనందరావు మొఖం వెలిగి వెలిగి ఆరిపోయిన మతాబా అనుకోండి. కామేశ్వరి కత్తితో అతని ముఖంమీద బోలెడన్ని పోట్లు తెగపొడిచి నట్లయింది. అతను కామేశ్వరి ముఖం చూడలేక పోయాడు. అతన్ని ఎగాదిగా చూసి మనసులో 'ఈ షావుకారు మంచివాడే కాని ఈ గుమాస్త దొంగలా వున్నాడు.' అనుకుంది.

అయితే షావుకారు ఆమెదగ్గిర నుంచి ఏం ప్రతిఫలం ఆశించాడో ఆమె కేం తెలుసు ?

అసలానందరావుకు ఏ మాత్రం బాధ కలగదు. కాని ఆనా డెందువల్లనో ఎంతో బాధపడిన గుండెతో ఇంటికి జేరాడు.

——